
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 8 ఆగస్టు 2024

పంట పండింది..!



కళకళలాడుతున్న వరిపంట

ఓవైపు కృష్ణమ్మ పరవళ్లు.. మరోవైపు భారీ వర్షాలు.. అన్నదాత ముఖంలో ఆశలను చిగురింపజేశాయి. జిల్లావ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం నమోదైంది. ఇదే తరుణంలో బుధవారం ప్రకాశం బ్యారేజీ గేట్లు పైకెత్తి కాల్వలకు సాగునీటిని విడుదల చేయడంతో పంటలకు ప్రాణం వచ్చింది. వివిధ పంటల సాగుకు ఇది అనుకూల వాతావరణమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక పులిగడ్డ వద్ద పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణానది లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

కరుణించిన వరుణుడు.. / ఉప్పొంగిన కృష్ణమ్మ...

- ప్రకాశం బ్యారేజీ నుంచి భారీగా వరద నీరు
- పులిగడ్డ అక్విడెక్టు వద్ద భారీ ప్రవాహం
- నిండుకుండలా ప్రధాన కాల్వలు
- కళకళలాడుతున్న పంట పొలాలు
- వరినాట్లు వేగవంతం చేసిన రైతులు
- శివారు ప్రాంతాలకు తీరిన చింత
- జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు
- 12వ తేదీ వరకూ కొనసాగే అవకాశం



బిరబిరా కృష్ణమ్మ

ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అటు జిల్లావ్యాప్తంగా వర్షాలు.. ఇటు పంటకాల్వలకు భారీగా వరద నీరు.. ఫలితంగా జిల్లావ్యాప్తంగా రైతులు వరినాట్లు వేగవంతం చేశారు. నాట్లు వేసిన పొలాల్లోని పైరుకు ఈ వాతావరణం అనుకూలమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నాగార్జున సాగర్ నుంచి భారీగా వరదనీరు రావడంతో బుధవారం ప్రకాశం బ్యారేజీ గేట్లు తెరిచారు. అన్ని ప్రధాన కాల్వలకు సాగునీటిని వదులుతున్నారు. ఇప్పటివరకు కాల్వల శివారు భూములకు సాగునీరు అందక రైతులు ఇక్కట్లపాలయ్యారు. కృష్ణానదికి వరదనీరు రావడం, వర్షాలు ఆశించిన మేర కురుస్తుండటంతో ఇక సాగునీటి ఇబ్బందులు తీరినట్టేనని రైతులు చెబుతున్నారు.

95,857 హెక్టార్లలో పంటల సాగు

జిల్లాలో బుధవారం నాటికి వివిధ రకాల పంటల సాగు వివరాలు ఇలా ఉన్నాయి. వరి 1.65 లక్షల హెక్టార్లకు గానూ 94,329 హెక్టార్లలో, మొక్కజొన్న 112 హెక్టార్లకు గానూ 33 హెక్టార్లలో, మినుము 1,135 హెక్టార్లకు గానూ 117 హెక్టార్లలో సాగు చేశారు. వేరుశెనగ 765 హెక్టార్లకు గానూ 116 హెక్టార్లలో, చెరకు 4,310 హెక్టార్లకు గానూ 1,258 హెక్టార్లలో సాగైంది. పెసలు, పత్తి, కందుల పంటల సాగు ఇంకా ప్రారంభమే కాలేదు. జిల్లావ్యాప్తంగా 1.72 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగు జరుగుతుందని అంచనాగా ఉండగా, ఇప్పటివరకు 95,857 హెక్టార్లలో జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా వర్షాలు

వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని బుధవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో వర్షం కురిసింది. కంకిపాడులో అత్యధికంగా 61.2 మిల్లీమీటర్లు, బాపులపాడులో అత్యల్పంగా 9.6 మిల్లీమీటర్లు నమోదు కాగా, జిల్లా సగటు వర్షపాతం 30.2 మిల్లీమీటర్లుగా ఉంది. నాగాయలంకలో 59.2, బంటుమిల్లిలో 58.0, పెదపారుపూడిలో 50.4, ఉంగుటూరులో 50.4, గన్నవరంలో 44.2, కోడూరులో 41.2, మచిలీపట్నంలో 39.8, పెడనలో 34.8, చల్లపల్లిలో 31.2, మొవ్వలో 28.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుడివాడలో 28.2, నందివాడలో 24.8, గూడూరులో 24.2, అవనిగడ్డలో 23.8, తోట్లవల్లూరులో 21.6, మోపిదేవిలో 20.0, ఉయ్యూరులో 18.4, కృత్తివెన్నులో 18.2, గుడ్లవల్లేరులో 16.2, ఘంటసాలలో 15.8, పమిడిముక్కలలో 15.4, పామర్రులో 13.2, పెనమలూరులో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

- 70 గేట్లను ఎత్తిన అధికారులు
- నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి

విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న నీటితో ప్రకాశం బ్యారేజీ నిండుకుండలా కనిపిస్తోంది. బ్యారేజీ 50 గేట్లను మూడు అడుగులు, 20 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి లక్షా41వేల856 క్యూసెక్కుల నీరు వస్తోంది. వజీలేపల్లి నుంచి లక్షా25వేల544 క్యూసెక్కులు, పాలేరు నుంచి 65, కీసర నుంచి 16,276 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీని నుంచి లక్షా 37వేల450 నీటిని బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 13,477 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కేఈబీకి 1,407, బందరు కాల్వకు 1,515, రైవస్ కాల్వకు 4,521, కేడబ్ల్యూకు 6,034 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏలూరు కాల్వకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. మరో నాలుగు రోజుల పాటు బ్యారేజీకి ఇన్‌ఫ్లో ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

నిండుకుండలా పులిచింతల

వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో కృష్ణానదీ పరివాహక ప్రాంతాలైన తోట్లవల్లూరు, ఘంటసాల, మోపిదేవి, చల్లపల్లి, అవనిగడ్డ మండలాల్లోని లంక గ్రామాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పులిగడ్డ అక్విడెక్టు వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో భద్రతా ఏర్పాట్లపై అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.



పులిగడ్డ వద్ద వరద ప్రవాహం



ప్రమాదంలో బోల్తాపడిన ట్రావెల్స్ బస్సు

బస్సు బోల్తా



నుజ్జునుజ్జయిన కారు

డ్రైవర్ సహా ప్రయాణికులకు స్వల్ప గాయాలు

- లారీని ఓవర్‌టేక్ చేయబోయి బస్సును ఢీకొన్న కారు
- కారు డ్రైవర్, ప్రయాణికులకు కూడా గాయాలు
- బస్సులో ఏడాదిలోపు చిన్నారులు నలుగురు.. సురక్షితం

కృత్తివెన్ను, ఆగస్టు 7 : ట్రావెల్స్ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో అనేకమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి కృత్తివెన్ను మండల పరిధిలోని యండపల్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి రాజోలు వెళ్తున్న కారు ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయింది. ఈ సమయంలో వ్యతిరేక మార్గంలో.. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు నుంచి కృత్తివెన్ను మీదుగా హైదరాబాద్ వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కారు బలంగా ఢీకొంది. దీంతో బస్సు పక్కనే ఉన్న గోతులోకి పల్టీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 25 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్, క్లీనర్‌తో పాటు మరో నలుగురు చిన్నారులు ఉన్నారు. కాగా, చిన్నారులు ఏడాదిలోపు వారైనా చిన్నగాయం కూడా కాకుండా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కారులో డ్రైవర్‌తో కలిపి నలుగురు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారు, బస్సు నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్లు ఇద్దరికీ గాయాలు కాగా, ప్రయాణికులందరికీ స్వల్ప గాయాలయ్యాయి. కారులో ఉన్న నలుగురిని హైవే అంబులెన్స్ సాయంతో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, బస్సు డ్రైవర్, క్లీనర్లను బంటుమిల్లి ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.



ప్రమాదం నుంచి బయటపడిన ఏడాదిలోపు చిన్నారి

సహకరించిన స్థానికులు

రాత్రి సమయంలో హైవేపై ఒక్కసారిగా పెద్దశబ్దం రావటంతో స్థానికులంతా ఉలిక్కిపడ్డారు. క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సు బోల్తా పడటం చూసి, కంగారుపడి అందరూ కలిసి సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో ఉన్న ప్రయాణికులందరినీ ఎత్తుకుని బయటకు తీసుకొచ్చారు. వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చాలామంది 25 కిలోమీటర్లలోపు వారు కావటంతో కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి త్వరగా చేరుకున్నారు. పోలీసులు వివరాలు సేకరించి, సహాయక చర్యలు అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైసీపీకి బిగ్ షాక్

విజయవాడ కార్పొరేషన్‌లో వైసీపీకి భారీ షాక్ తగిలింది. సుమారు 20 మంది వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 8 మంది కార్పొరేటర్లు విజయవాడ పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరిని కలిసి తాము పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పడం గమనార్హం.

విజయవాడ కార్పొరేషన్‌లో మారుతున్న సమీకరణాలు

- వైసీపీకి గుడ్‌బై చెప్పనున్న 20 మంది కార్పొరేటర్లు
- తాజాగా సుజనా చౌదరిని కలిసిన 8 మంది

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 64 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వారిలో వైసీపీకి 49, టీడీపీకి 14, సీపీఎంకు ఒకరు చొప్పున కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య వైసీపీ వైపు వెళ్లి, ఎన్నికల అనంతరం సొంతగూటికి వచ్చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో 20 మంది కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమి వైపు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 8 మంది వైసీపీ కార్పొరేటర్లు బుధవారం సుజనా చౌదరిని కలిశారు. తాము మర్యాదపూర్వకంగానే కలిశామని చెబుతున్నా పార్టీని వీడేందుకు సిద్ధమయ్యే వారు సుజనాను కలిసినట్లు తెలుస్తోంది. సుజనాను కలిసిన వైసీపీ కార్పొరేటర్లలో మహాదేవు అప్పాజీ, అత్తులూరి ఆదిలక్ష్మి, మరుపిళ్ల రాజేశ్, గుడివాడ నరేంద్ర, మైలవరపు రత్నకుమారి, అర్షద్, ఉమ్మిడిశెట్టి బహదూర్‌తో పాటు గతంలో వైసీపీకి వెళ్లిన మాధురి లావణ్య కూడా ఉన్నట్లు సమాచారం. వైసీపీ కార్పొరేటర్లు సుజనా చౌదరిని కలవడంతో ఆ పార్టీ నాయకుల్లో ఆందోళన నెలకొంది. ఈ సమాచారం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు.. కార్పొరేటర్లను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు వైసీపీ కార్పొరేటర్లను కూటమి పార్టీల్లో చేర్చేందుకు చాపకింద నీరులా తన ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు ఆయనతో టచ్‌లోకి వచ్చినట్లు సమాచారం.

పశ్చిమ నుంచే ఎక్కువ

మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందిన పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 22 డివిజన్లకు 19 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల్లో టీడీపీ కాస్త పోటీ ఇచ్చింది. సెంట్రల్‌లోని 21 స్థానాలకు వైసీపీ 16 స్థానాల్లో గెలుపు సాధించింది. తూర్పులో 21 స్థానాలకు ఏడు స్థానాల్లో టీడీపీ, 14 స్థానాల్లో వైసీపీ గెలుపొందింది. ప్రస్తుతం పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమిలోని పార్టీల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. విజయవాడ సెంట్రల్, తూర్పు నుంచి కూడా పలువురు వైసీపీ కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారు. అయితే, నిబంధనల ప్రకారం మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే 2025-మార్చి వరకు వేచి చూడాల్సి ఉంటుంది. దీంతో మేయర్ పీఠం కూటమికి దక్కే అవకాశాలు లేవు. కార్పొరేషన్‌లో ఆధిపత్యం చాటుకోవడానికి మాత్రమే మారిన సమీకరణాలు ఉపయోగపడే అవకాశం ఉంది.

ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి..

పెడన, ఆగస్టు 7 : పెడన పట్టణంలోని ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. పట్టణంలోని ఒకటి, 20వ వార్డుల వైసీపీ కౌన్సిలర్లు బళ్ల పద్మావతి, కొసనం కరుణకుమారి బుధవారం స్థానిక పోలవరపుపేట కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావును కలిశారు. వారి సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు అబ్దుల్ ఖయూం, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, యిమ్మడి నాగపోత రావు, హమీదుల్లా, పరసా జితేంద్ర, ఎలిగట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణప్రసాద్, వేణుగోపాలరావు సమక్షంలో టీడీపీలో చేరిన పద్మావతి, కరుణకుమారి

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- 213 పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ
- స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించి క్రీడాకారులకు ప్రోత్సాహం
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ బాలాజీ

6లో

మచిలీపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

- రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వే నిర్ణయం

6లో

సంక్షోభంలో చేనేత

జాతీయ చేనేత దినోత్సవంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

6లో

రహదారుల విస్తరణకు అనుమతులు ఇవ్వండి

» కేంద్రమంత్రికి ఎంపీ బాలశౌరి వినతి



మచిలీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో జాతీయరహదారుల విస్తరణ, అనుసంధానానికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం వినతిపత్రాలు అందించారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలసిన ఎంపీ మచిలీపట్నం పోర్టుపనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో సరుకుల రవాణాకోసం పెడన-గుడివాడ మధ్య జాతీయరహదారిని నాలుగులేన్లకు విస్తరించాలని కోరారు. పోర్టు నుంచి పెడనవరకు 4కిలోమీటర్లమేర జాతీయరహదారి 216ను నిర్మాణం చేయాలని కోరారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయరహదారి 65ను కలిపేలా పోర్టు ప్రాంతంలోని చిలకలపూడినుంచి రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. గన్నవరం నియోజకవర్గంలోని వీరపనేనిగూడెంవద్ద 200స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో చినపఅవుటపల్లి-కాజగ్రామాల మధ్య జాతీయరహదారికి సర్వీస్‌రోడ్డును వేయాలని కోరారు. రహదారులను అనుసంధానం చేస్తూ రోడ్డును నిర్మాణానికి అనుమతులివ్వాలని కోరారు. ప్రతిపాదనలకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ బాలశౌరి తెలిపారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

వైసీపీ నిర్లక్ష్యంతోనే సంక్షోభంలో చేనేత

» ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, ఆగస్టు 7 : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఫలితంగా ఆ పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. జిల్లా చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలవరపుపేట కళ్యాణ మండపంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ ఫండ్, యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేటు తదితర పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని దుయ్యబట్టారు. రద్దయిన పథకాలను పునరుద్ధరించడంతో పాటు మరిన్ని పథకాలను అమలు చేసి చేనేత కార్మికుల జీవితాలలో వెలుగులు నింపుతామన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, పెడన నుంచే ఇంటర్నెట్ ద్వారా చేనేత వస్త్ర వ్యాపారం చేసుకునేలా ఆలోచనలు చేయాలన్నారు. చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, చేనేత రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలకు కూడా పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో వాణిలు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కృష్ణమ్మ పరవళ్లు

ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరుతుండటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. దాములూరు కూడలి వద్ద వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ముక్త్యాల గ్రామం వద్ద కృష్ణా తీరాన ఉన్న భవానీ ముక్తేశ్వరాలయం నీట మునిగింది. పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2.40 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. ప్రాజెక్టు నుంచి 11 గేట్ల నుంచి 2.80 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు జలకళ రావడంతో ఎమ్మెల్యే తాతయ్య తదితరులు పంటపొలాలను సస్యశ్యామలం చేయాలని కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, గాజులు, చీర సారె సమర్పించారు. అలాగే పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద ప్రమాశం కొనసాగుతోంది. పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఎక్కడికక్కడ టోల్‌ఫ్రీ నెంబర్లను అందుబాటులో ఉంచారు.




ముక్త్యాల వద్ద ఉత్తర వాహినిగా కృష్ణమ్మ






ఉధృతంగా వైరా కట్టలేరు

నందిగామ రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరుతుండటంతో దాములూరు కూడలి వద్ద వైరాకట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కాజ్‌వే పైనుంచి నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాజ్‌వే పైనుంచి, వీరులపాడు-నందిగామ మండలాల మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు.

జలదిగ్బంధంలో ముక్తేశ్వరాలయం..

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 7 : కృష్ణా నదికి వరద నీరు పోటెత్తింది. పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు విడుదల చేయటంతో ముక్త్యాల గ్రామం కృష్ణానది ఒడ్డునున్న భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం నీటమునిగింది. పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని రెండు వైపులా భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో నదీ పరీవాహక గ్రామాలైన రావిరాల, వేదాద్రి, ముక్త్యాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు సూచిస్తున్నారు. పులిచింతల పూర్తి స్థామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను ప్రస్తుతం 33 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఎగువ నుంచి 2.40 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి కిందకు 11 గేట్ల ద్వారా 2.89 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


వేదాద్రి వద్ద కృష్ణానది వరద పరిస్థితిని మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు పరిశీలించారు. ఘాట్‌ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

పులిచింతలకు జలహారతి..

జగ్గయ్యపేట/జగ్గయ్యపేట రూరల్ : పులిచింతల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, గుంటూరు జిల్లా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు శాస్త్రోక్తంగా జలహారతి నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణలు, పూజలతో కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, గాజులు, చీరె, సారె సమర్పించారు. బిలబిల ప్రవహిస్తూ పంట పోలాలను సస్యశ్యామలం చేసి, సిరులు కురిపించాలని కృష్ణమ్మ తల్లిని ప్రార్థించినట్టు తాతయ్య చెప్పారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, పంట సమృద్ధిగా పండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వరదపై ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, టెండర్ ప్రక్రియ ముగిసిందని త్వరలో పనులు చేపడతామని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


జలహారతి కార్యక్రమంలో ఎమ్మెల్యేలు

అధికారులు అప్రమత్తం..

అవనిగడ్డ/ అవనిగడ్డ రూరల్ : కృష్ణానదికి వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనల మేరకు అవనిగడ్డ నియోజకవర్గంలోని లంక గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకున్నామని, బుధవారం ప్రకాశం బ్యారేజీ నుంచి 1.37 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు డీఈ రవికిరణ్ తెలిపారు. పులిచింతల నుంచి 2.88 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారని, సాగునీటి అవసరాలు పోనూ సుమారు 2.50 లక్షలు దిగువకు విడుదల చేస్తారని, శుక్రవారం నాటికి పులిగడ్డకు చేరుకుంటుందన్నారు. ఎడ్లంక వద్ద కాజ్‌వే మునిగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని లంకల్లో గొర్రెల కాపరులు, వ్యవసాయ పనులు చేసుకునే వారిని హెచ్చరించినట్టు డీఈ తెలిపారు. 5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా కరకట్టలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ఉధృతి..

ప్రకాశం బ్యారేజీ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చొచ్చుకు రావటంతో పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో వరద ప్రవాహం తగ్గే అవకాశం లేకపోవటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. చేపల వేట కొనసాగించే అవకాశం లేకపోవటంతో పులిగడ్డ ఆక్విడెక్ట్ సమీపంలో పడవలను లంగరు వేసి ఒడ్డున నిలిపారు.

పరీవాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలి

ఘంటసాల : ఎగువ నుంచి వరద నీరు వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ ప్రజలకు సూచించారు. బుధవారం సాయంత్రం శ్రీకాకుళం గ్రామంలోని కృష్ణానది తీరప్రాంతాలైన శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాలను వీఆర్వో తూము శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం 1070, 112, 18004250101 టోల్ ఫ్రీ నెంబర్‌తోపాటు 9908664645 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పమిడిముక్కలలో కంట్రోల్ రూమ్

పమిడిముక్కల మండలం లంకపల్లి, ఐనపూరు గ్రామాల ప్రజలు అప్రత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ అన్నారు. లంకపల్లి, ఐనపూరులో బుధవారం పర్యటించి నదీపాయలో వరదనీటి ప్రవాహం పరిశీలించారు. వరద పెరుగుతున్న కారణంగా ముంపు ప్రాంతాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు రావాలని, పశువులను తరలించాలని కెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసామని అత్యవసర సమయంలో 9908664623, 8639382235 నెంబర్లకు ఫోన్‌చేయాలని తెలిపారు.


పులిగడ్డ వద్ద నిలిచిన పడవలు

కృష్ణావర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌గా జయశంకరప్రసాద్


వీసీ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న జయశంకరప్రసాద్

మచిలీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాయూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా చెరుకూరి జయశంకరప్రసాద్‌ను నియమిస్తూ యూనివర్సిటీ వీసీ ఆర్.శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ శోభన్‌బాబు ఉత్తర్వులను జయశంకరప్రసాద్‌కు అందజేశారు. ప్రస్తుతం జయశంకరప్రసాద్ కృష్ణాయూనివర్సిటీలో ఎంబీఏ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఎంబీఏ విభాగం హెచ్‌వోడీగా పనిచేస్తున్నారు. ఇటీవలికాలంలో యూనివర్సిటీలోని రీసెర్చ్‌అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో పరిపాలనాపరమైన అంశాలపై పలు ఆరోపణలు వచ్చాయి. రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీల ప్రదానంలో తీవ్రజాప్యం చేయడం, కొంతమంది స్కాలర్లు పత్రాలు సక్రమంగా సమర్పించకున్నా పీహెచ్‌డీ డిగ్రీలను ప్రదానం చేయడంతో ఈ విభాగం వివాదాల్లో చిక్కుకుంది. దీంతో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా జయశంకరప్రసాద్‌కు బాధ్యతలను అప్పగించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పీవీ రామారావు తదితరులు

ఆంధ్రా హాస్పిటల్స్‌లో మదర్స్ మిల్క్ బ్యాంక్

మాచవరం, ఆగస్టు 7 : నవజాత శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఆంధ్రా హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ డాక్టర్, డైరెక్టర్ పీవీ రామారావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆసుపత్రిలో 'మదర్స్ మిల్క్ బ్యాంక్'ను ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెలలు నిండకుండా పుట్టిన నవజాత శిశువుకు, బరువు తక్కువ పుట్టిన శిశువుకు తల్లిపాలు సరిగా రానప్పుడు ఈ మిల్క్ బ్యాంకులోని పాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. తల్లిపాలు తీసుకున్న నవజాత శిశు మరణాలు చాలా తక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయన్నారు. పాలు ఎక్కువగా ఉన్న తల్లుల నుంచి సేకరించి బ్యాంకులో నిల్వ ఉంచితే ఆరు నెలల వరకు ఉపయోగించవచ్చన్నారు. రాష్ట్రంలోనే మొదటిగా ఆంధ్రా హాస్పిటల్స్‌లో రోటరీ క్లబ్ విజయవాడ సహకారంతో 'మదర్స్ మిల్క్ బ్యాంక్' ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నవజాత శిశు వైద్య నిపుణులు డాక్టర్లు సుజాత, గౌతమి, ఆశ్రితలు పాల్గొన్నారు.


వైద్యులను సత్కరిస్తున్న డాక్టర్ రాంప్రసాద్

తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదు : డాక్టర్ రాంప్రసాద్

పాయకాపురం : తల్లిపాలు నవజాత శిశువులకు ప్రాణదాతగా నిలుస్తుందని రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్, డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని బుధవారం కరెన్సీ నగర్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా తల్లిపాలను దానం చేసిన మాతృమూర్తులను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ, తల్లిపాలు బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్‌ల నుంచి, ముఖ్యంగా తీవ్రమైన పేగు ఇన్‌ఫెక్షన్ నుంచి శిశువును కాపాడతాయన్నారు. నెలలు నిండకుండా జన్మించిన శిశువులు తల్లిపాలను పొందలేరని ఆ శిశువులకు దాత పాలు ఇవ్వడం ఉత్తమమైన మార్గం అని తెలిపారు. డాక్టర్ బిఎస్‌సిపి రాజు మాట్లాడుతూ, తల్లి పాలను దానం చేసిన తల్లులందరికీ అభినందనలు తెలిపారు. ఇతర తల్లులకు ఆదర్శంగా నిలిచేందుకు తల్లిపాలను సేకరించి అందించిన వైద్యులు సౌమ్య శ్రీలతలను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ శివరామరాజు, డాక్టర్ పి.బ్రాజిష్ణ ఉమ మిక్కిలినేని, స్నేహ మద్దుకూరి, ఎం.విజయ, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రాథమిక వ్యవసాయసహకార సంఘాల(పీఏసీఎస్) బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరించడం, పీఎం కిసాన్ సమృద్ధికేంద్రాల ఏర్పాటు, ప్రధాన మంత్రి జన్‌ఔషధి కేంద్రాల ఏర్పాటు, పీఏసీఎస్‌ల ద్వారా పెట్రోల్‌బంకుల నిర్వహణ, మల్టీపర్పస్ గూడౌన్‌ల నిర్మాణం, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కేడీసీసీబీకి ద్వారా జిల్లాలోని 213 పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించే ప్రక్రియను చేట్టామని అధికారులు తెలిపారు. నందమూరు, ఉల్లిపాలెం, కౌతవరం, ఆముదాలపల్లి పీఏసీఎస్‌ల ద్వారా హెచ్‌సీఎల్ పెట్రోల్‌బంకులను ఏర్పాటుచేసేందుకు అనుమతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. సమావేశంలో డీసీవో చంద్రశేఖరరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్‌మనోహర్, పశుసంవర్థకశాఖ జేడీ డి.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ డీడీ మనోహరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన ఎస్పీ

స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించాలి

జిల్లాలో స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించి క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మచిలీపట్నంలోని ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్పోర్ట్ అథారిటీకి ఆర్థికవనరులు సమకూర్చేందుకు పంచాయతీల ద్వారా వసూలుచేసే ఇంటిపన్నులనుంచి మూడుశాతం సెస్‌ను జిల్లాక్రీడాభివృద్ధి సంస్థఖాతాకు జమచేసేలా చర్యలు తీసుకోవాలని డీపీవో నాగేశ్వరనాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్పోర్ట్ అథారిటీ వైస్ చైర్మన్, ఎస్పీ ఆర్. గంగాధరరావు మాట్లాడుతూ, క్రీడలను ప్రోత్సహించేందుకు పోలీస్‌శాఖ ద్వారా తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. మచిలీపట్నంలోని ఇండోర్ స్టేడియం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాలని జిల్లా అధికారి కె.ఝాన్సీ తెలిపారు. సమావేశంలో డీఎం అండ్‌హెచ్‌వో గీతాబాయి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసిరండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశం

కృష్ణలంక, ఆగస్టు 7 : గ్రామాలను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి ఆలోచనను ఆచరణలో పెట్టేందుకు భవిష్యత్ అవసరాలు, ప్రజల సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రామ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన ప్రణాళికలపై బుధవారం జిల్లా కలెక్టర్ సృజన కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధిలో అధికారుల ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. ప్రజల ప్రస్తుత సామాజిక అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం వుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి రాబోయే మూడేళ్లలో చేపట్టి పూర్తి చేయాల్సిన పనుల నివేదికను రూపొందించాలన్నారు. మౌలిక వసతులైన రహదారులు, డ్రెయిన్లు, వీధి లైట్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి దశల వారీగా కలర్ కోడ్‌లతో ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం చేపట్టి పూర్తి చేయాల్సిన పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. 2025 మార్చి నాటికి ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిల ఏర్పాటు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఉపాధి పథకం కింద ఈ ఏడాది లక్ష్యాన్ని సాధించేందుకు నెలకు 3 లక్షల పనిదినాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలానికి కేటాయించే నిధులతో పాటు, డీఎంఎఫ్ నిధులను కూడా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జె.సునీత, పంచాయతీ రాజ్ ఎస్ఈ అక్కినేని వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డీవీ రమణ, జిల్లా పంచాయతీ అధికారి ఎన్.వి.శివప్రసాద్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, రూరల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

» పరిహారం కోరుతూ మృతుడి స్నేహితులు, బంధువుల ఆందోళన

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7 : మచిలీపట్నంకు చెందిన మార్బుల్ పనిచేసే కార్మికుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి స్నేహితులు, బంధువులు నష్ట పరిహారం చెల్లించాలంటూ ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. టెంపుల్ కాలనీకి చెందిన గంజాల మణికంఠ (18) రామయ్య మెస్ యజమాని ఇంటి వద్ద మార్బుల్ పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం మణికంఠ స్నేహితులు, బంధువులు రామయ్య మెస్ వద్ద నష్టపరిహారం చెల్లించాలంటూ ఆందోళనకు దిగారు. మణికంఠ తండ్రి తాతారావు లారీ డ్రైవర్ కోల్‌కతా వెళాడు. మణికంఠకు ఇద్దరు చెల్లెళ్లు. పేద కుటుంబానికి చెందిన మణికంఠ మృతిచెందడంతో నష్టపరిహారం చెల్లించాలని అతడి స్నేహితులు, బంధువులు ఆందోళనకు దిగారు. మణికంఠ తల్లి నాగమల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. చిలకలపూడి సీఐ సతీష్ కేసు నమోదుచేశారు. అనంతరం పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకోవడంతో ఉద్యమం విరమించారు.



లక్ష్మీటాకీసు సెంటర్‌లో ఆందోళన చేస్తున్న గంజాల మణికంఠ స్నేహితులు, బంధువులు.. గంజాల మణికంఠ (ఇన్‌సెట్)

మచిలీపట్నం - తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ : ప్రయాణికుల రద్దీ నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈనెల 7, 9 తేదీల్లో (బుధ, శుక్ర) వారాల్లో 07249 మచిలీపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నది. గురు, శనివారాల్లో (ఈనెల 8, 10 తేదీల్లో) 07250 తిరుపతి-మచిలీపట్నం మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నది. రెండేసి సర్వీసులు నడుస్తాయని దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళ్లు పెడన, గుడ్లవల్లేరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగనున్నాయి.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

అల్ట్రాటెక్.. చెక్కు అందజేత

జగ్గయ్యపేట రూరల్ : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాద ఘటనలో మృతుడు గుగులోతు గోపీ నాయక్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కంపెనీ అందించిన రూ. 50 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

15 మందికి రిమాండ్ పొడిగింపు

గన్నవరం : స్థానిక టీడీపీ కార్యాలయంపై దాడిఘటనలో నిందితులకు గన్నవరం కోర్టు రిమాండ్ పొడిగించింది. తొలుత 15 మందిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించి నూజివీడు సబ్ జైలుకు పంపించారు. వారు బుధవారం వాయిదాకు రాగా 14 రోజులు రిమాండ్ పొడిగించారు. కోర్టు నుంచి తీసుకువెళ్లే క్రమంలో ఫొటోలు వీడియోలు చిత్రీకరిస్తున్న విలేకరులపై నిందితులు దురుసుగా ప్రవర్తించారు.


రైస్‌మిల్‌పై కేసు నమోదుచేస్తున్న అధికారులు

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు

» 723 బస్తాలు స్వాధీనం.. కేసు నమోదు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7 : మచిలీపట్నం జగన్నాథపురంలోని విజయలక్ష్మి రైసుమిల్లులో పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్టు సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదు అందడంతో రైసుమిల్లుపై దాడిచేసి 723 బస్తాలు ఉన్నట్టు గుర్తించారు. రైసుమిల్లర్ కొల్లిపర రాజశేఖర్‌పై కేసు నమోదు చేశారు. తెలంగాణాకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన 723 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ సుబాన్‌బి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

గోదాదేవికి పంచామృతాలతో అభిషేకం



గన్నవరం, ఆగస్టు 7 : మండలంలోని దావాజీగూడెం సీతా రామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం గోదాదేవికి తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం గోదాదేవి అమ్మవారికి 58 లీటర్ల ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. తిరుప్పావై ప్రబంధ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, భగవన్నామ సంకీర్తన చేశారు. ఆలయ అర్చకులు రామాచార్యులు విశేష పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్లే స్కూల్స్‌కు దీటుగా అంగన్వాడీలు

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఆగస్టు 7: కార్పొరేట్ ప్లే స్కూల్స్‌కు దీటుగా అంగన్వాడీలను తీర్చిదిద్దనున్నట్టు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని రామవరప్పాడులోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు బుధవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా అంగన్వాడీ కార్యకర్త శ్రీలక్ష్మి ఏర్పాటు చేసిన గర్భిణులకు సీమంతం కార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ వారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆ తర్వాత అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్య నేర్చుకున్న చిన్నా రులకు పట్టాలు ఇచ్చి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నతస్థితికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అంగ న్వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆడుకోవడానికి అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఆరోగ్యవం తమైన ఆహారాన్ని వారికి అందించడం జరుగుతుందని తెలి పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా సత్కరించి, పేరంటాలమ్మ చిత్రపటాన్ని అందజేశారు.



రామవరప్పాడు అంగన్వాడీ కేంద్రంలో జరిగిన సీమంతం కార్యక్రమంలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు



పొట్టిపాడులో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ వి.సరోజిని

తల్లిపాల ప్రాధాన్యాన్ని గుర్తించాలి

● ఎంపీపీ వడ్లమూడి సరోజిని

ఉంగుటూరు : తల్లిపాలు తాగే పిల్లల్లో తెలివితేటలు వృద్ధి చెందుతాయని, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని, తల్లిపాలకు మించిన దివ్యఔషధం మరొకటి లేదని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలోని పొట్టిపాడు అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ, తల్లిపాలకున్న ప్రాధాన్యాన్ని తల్లులందరూ గుర్తించాలన్నారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వటంవల్ల తల్లీబిడ్డల మధ్య బలమైన అనుబంధం ఏర్పడుతుందని, కొన్నిరకాల వ్యాధులనుంచి ఇరువురికి రక్షణ కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టత - పోషకవిలువలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పెనమలూరు సీఐగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ



వెంకటరమణ

పెనమలూరు, ఆగస్టు 7 : పెనమలూరు సీఐగా వెంకటరమణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటరమణ గతంలో విజయవాడ ఏసీబీలో ఇన్‌స్పెక్టరుగా పనిచేసారు. సాధారణ బదిలీపై పెనమలూరు వచ్చారు. గతంలో పెనమలూరు సీఐగా పనిచేసిన టీవీవీ రామారావు బదిలీపై ఉయ్యూరు స్టేషన్‌కు వెళ్లారు. బుధవారం నూతన సీఐను సిబ్బందికి పరిచయం చేశారు.

ఉయ్యూరు సీఐగా రామారావు



రామారావు

ఉయ్యూరు : ఉయ్యూరు సీఐగా టీవీవీ రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పెనమలూరు నుంచి బదిలీపై ఉయ్యూరు వచ్చిన రామరావుకు పట్టణ స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన ఎండీ హబీబ్ బాషా బదిలీపై ఏలూరు రేంజికి వెళ్లగా ఆయన స్థానంలో రామారావు బాధ్యతలు స్వీకరించారు.

పంచాయతీ ప్రణాళికపై శిక్షణ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 7 : గ్రామ పంచాయతీ ప్రణాళికపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె. రత్నకుమారి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ప్రణాళికపై ఈ నెల 12,13, 14 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం ఉంటుందని సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చి హాజరయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణా కార్యక్రమంలో ముగింపు రోజు చెత్త నుంచి సంపద కేంద్రాలను సందర్శించే కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. సర్పంచ్‌లతో పాటు కార్యదర్శులు విధిగా హాజరు కావాలని చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓడీఎఫ్ సర్వేను కూడా వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు పట్ల అలసత్వం వహించకూదని కార్యదర్శులను ఎంపీడీవో హెచ్చరించారు.

ఉంగుటూరు : పారిశుధ్యం అండ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ అండ్ ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణపై మండలంలోని అన్నిగ్రామాల సర్పంచ్‌లు, గ్రేడ్-1, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 8నుంచి 10వ తేదీ వరకు మండలస్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సం. వార్షిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్థానిక స్త్రీశక్తిభవనం మీటింగ్ హాలులో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

నోట్‌బుక్స్, స్వీట్లు పంపిణీ



అంగన్వాడీ కేంద్రంలో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న కల్కి మానవ సేవాసమితి సభ్యులు

ఉయ్యూరు, ఆగస్టు 7 : శ్రీపరంజ్యోతి భగవతి భగవాన్ సప్తదాన మహోత్సవం పురస్కరించుకుని శ్రీకల్కి మానవ సేవా సమితి ఉయ్యూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ సెంటర్, లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నోట్‌పుస్తకాలు, పెన్సిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గాయత్రి, జీపీ శర్మ, ఇతర సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బోడపాడులో వైద్యశిబిరం

విజయవాడ రూరల్, ఆగస్టు 7 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నున్నలోని బోడపాడు కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్న ట్లు ఎంపీడీవో శేషగిరిరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ ఉచిత వైద్యశిబిరంలో గుండె, ఎముక, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వివాహిత పోస్టుమార్టం నిలిపివేత

గన్నవరం, ఆగస్టు 7 : మండలంలోని గోపవరపుగూడెంలో కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న వివాహిత పోస్టుమార్టం నిలిచి పోయింది. మృతురాలి తల్లి ఎ.గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. తన కుమార్తె బొబ్బిలి సౌజన్యను ఆమె భర్త మద్యానికి బానిసై వేధించేవాడని ఫిర్యాదులో పేర్కొంది. భర్త పెట్టే బాధలు పడలేక పోలవరం కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

హనువాన్‌జంక్షన్, ఆగస్టు 7 : మండలంలో గురువారం నిర్వహించనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబం. దించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ తెలిపారు. మండలంలో 62 ప్రభుత్వ పాఠశాలల్లో (హైస్కూల్స్, ప్రైమరీ స్కూల్స్) ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తరగతి గదికి ముగ్గురు సభ్యులు చొప్పున ఎంపిక చేసి అన్ని తర గతులు మీద ఎంపిక చేసిన సభ్యులు నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎన్నుకోనున్నట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్లోరోసిస్ బాధితులకు వీల్‌చైర్లు పంపిణీ



వీల్‌చైర్లు పంపిణీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 7 : జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా పోరంకి టీడీపీ కార్యాలయంలో ఫ్లోరోసిస్ బాధితులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వీల్‌చైర్ లంబార్ బెల్టు, నెక్ బెల్టు, వాకర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, అంగిరేకుల మురళి, నర్రా చంటి, తుమ్మల రామ్‌కుమార్, దేవినేని రాజా, పీతా గోపీచంద్, సంగెపు రంగారావు, డీపీఎంఓ డాక్టర్ మహేష్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ బిజిలీ శ్రీనివాస్, డాక్టర్ బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ మార్ట్ ప్రారంభం

కానూరు ఎనభై అడుగుల రోడ్డులో బుధవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ క్వాలిటీ మార్ట్‌ను ప్రారంభించారు. సంస్థ యజమాని షేక్ బుజ్జి మాట్లాడుతూ, క్వాలిటీ మార్టులో నిత్యం లైవ్ ఫిష్, మటన్, చికెన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత బోడె వెంకట్రామ్, కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, రెహమాన్, వర్ల కొండ, బన్నీ, రంగారావు, సమీర్, రియాజ్ పాల్గొన్నారు.

పోరంకి రోడ్లకు మరమ్మతులు చేయాలి

పోరంకిలోని నిడమానూరు రోడ్డు, విజ్ఞాన్‌భారత్ స్కూల్ రోడ్ల మరమ్మతులకు చొరవ చూపాలని స్థానిక ఎమ్మెల్యేను సీపీఎం నాయకులు కోరారు. రోడ్ల దుస్థితిపై వారు ఎమ్మెల్యేకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. వర్షాలకు రోడ్లు పాడై పోయి పాఠశాలల విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను వారు ఎమ్మెల్యేకి వివరించారు. సీపీఎం ఉప్పాడ త్రిమూర్తులు, లావణ్య, భవాని, పాతాళ లక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పొంగుతున్న పుల్లేరు- ముంపులో ఇళ్లు



ఆనందపురం రోడ్లపైకి వచ్చిన నీరు

గండిగుంట(ఉయ్యూరు), ఆగస్టు 7 : గండిగుంట పంచాయతీ పరిధి ఆనందపురంలో పుల్లేరు కాల్వ పొంగి రోడ్లు, ఇళ్లలోకి నీరు చేరి స్థానికులు ఇబ్బంది పడ్డారు. పుల్లేరులోకి ఎగువనుంచి ఎక్కువ నీరు వదలడంతో కట్టలపై పొంగి ఆనందపురం, వెంకటాపురంలో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు ముంపునకు గురయ్యాయి. చినఓగిరాల, గండిగుంట పరిధి పొలాల్లోకూడా పుల్లేరు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కట్టలపై నుంచి నీరు పొంగి కాలనీలు, పొలాల్లో ప్రవహించడాన్ని ఇరిగేషన్ ఏఈ కంకిపాడు డివిజన్ మణికంఠను వివరణ కోరగా రైవస్ కాల్వ నిండుగా ప్రవహించడంతో పుల్లేరు నీరు ఎగదట్టిందని, పుల్లేరులో గుర్రపుడెక్క తొలగింపు పనులు కొనసాగుతున్న సందర్భంగా కొద్దిగా నీరు వదిలి తగ్గించామని తెలిపారు.

క్రీడాస్ఫూర్తిని పెంచేందుకే ఆటల పోటీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 7 : విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని దోనవల్లి రామారావు, వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు. వేలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవల్ ఫీల్డ్ గేమ్స్‌ను బుధవారం స్థలదాత దోనవల్లి రామారావు, వేములపల్లి శ్రీనివాసరావులతో కలిసి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు.



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న దోనవల్లి రామారావు, వి.శ్రీనివాసరావు

చెరువుల ఆదాయం గ్రామాభివృద్ధికి వినియోగించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 7 : కొయ్యూరు గ్రామానికి చెందిన రెండు చెరువులపై వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కొల్లి వీరవెంకట సత్యనారాయణ డీఎఫ్‌ఓ రవిశంకర్‌ను కోరారు. గ్రామానికి చెందిన బండివానిగుంట, పెద్ద చెరువులను ఆయకట్టు రైతుల వినియోగానికి కాకుండా నూజివీడు ఏఎంసీ (మార్కెట్‌యార్డ్ సొసైటీ) చేపల సాగుకు ఇస్తూ ఆదాయాన్ని సొసైటీ తీసుకుంటున్నారని గతంలో డీపీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలిం చేందుకు డీఎఫ్‌ఓ రవిశంకర్ బుధవారం గ్రామంలో పర్యటించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలగా సాయిచౌదరి, ఫీల్డ్ అసిస్టెంట్ రాయవరపు హరివర్మ, కాండ్రు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య బిర్లా ఓపస్ పెయింట్ గ్యాలరీ ప్రారంభం



ఆదిత్య బిర్లా పెయింట్స్ షోరూం ప్రారంభోత్సవంలో సంస్థ ప్రతినిధులు

పెనమలూరు, ఆగస్టు 7 : పోరంకి సెంటరు బందరు రోడ్డుపై రాష్ట్రంలోనే మొదటి ఆదిత్య బిర్లా ఓపస్ పెయింట్ గ్యాలరీని బుధవారం ప్రారంభించారు. విజయదుర్గా ఏజెన్సీస్ పేరుతో ప్రారంభించిన ఈ పెయింట్ గ్యాలరీ రాష్ట్రంలోనే మొదటిది, అదీ పోరంకిలో ప్రారంభించడం ఆనందంగా ఉందని షోరూం యజమాని కేవీ బాలకృష్ణ వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి అతిథులుగా బోడె వెంకట్రామ్, సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఉత్పల్ సోనీ, జోనల్ హెడ్ సిద్ధార్థ, ఏపీ రీజినల్ సేల్స్ మేనేజర్ సుమన్‌రెడ్డి హాజరయ్యారు.

దమ్ము చక్రాల ట్రాక్టర్‌లతో రోడ్లు ధ్వంసం



గన్నవరం, ఆగస్టు 7 : మండలంలోని పలు గ్రామాల్లో దమ్ము చక్రాల ట్రాక్టర్‌లతో ఆర్ అండ్‌బీ, అంతర్గత రహదారులు ధ్వంసం చేస్తున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరం కావటంతో దమ్ము చక్రాలు తగిలించి ఆర్‌అండ్‌బీ రోడ్లపై తిరగడంతో రోడ్లన్నీ నాశనం అవుతున్నాయి. అధికారులు పట్టిం చుకోవటం లేదు. తెంపల్లి, చిక్కవరం, సావరగూడెం తదితర గ్రామాల్లో రోడ్లు ధ్వంసం అవుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుంతలు పడితే కనీసం మరమ్మతులు కూడా చేయటం లేదు. రోడ్లు ధ్వంసం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ పంపిణీ పూర్తిచేయాలి

ఉంగుటూరు, ఆగస్టు 7 : మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్(ఎండీయూ)వాహనాల ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు రేషన్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈనెల 10వతేదీ కల్లా వందశాతం పూర్తిచేయాలని తహసీల్దార్ జె.విమలకుమారి ఎండీయూ సిబ్బందిని ఆదేశించారు. ఎండీయూ వాహనాలద్వారా ఇందుపల్లి, మానికొండ గ్రామాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీ విధానాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీ జి.శ్రీలత, ఇన్‌చార్జి ఆర్ఐ. శశికుమార్ ఇందుపల్లి, మానికొండ వీఆర్వోలు ఎస్.వినోద్‌కుమార్, కేవీ.నాగేశ్వరరావు, వి.వెంకటరాము పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నేతలు



తహసీల్దార్ విమలకుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నేతలు

మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జాలాది విమలకుమారిని బుధవారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలను నాయకులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు ఈడ్పుగంటి కృష్ణమూర్తి, నూతక్కి బెనర్జీ, దాసరి నాగేంద్ర, తొమ్మండ్రు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.30

నిత్యాన్నదాన పథకానికి విరాళం

మోపిదేవి, ఆగస్టు 7: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి కానూరు గ్రామానికి చెందిన పరుచూరి సాయికుమార్- ప్రియాంక దంపతులు రూ.55,505 విరాళంగా అందజేశారు. బుధవారం ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామిని వారు దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణకు నగదు అందజేశారు.

బోనస్ పంపిణీ

పెడన, ఆగస్టు 7: కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మడక పాల సంఘంలో పాల ఉత్పత్తిదారులకు బుధవారం రూ. 91,940 బోనస్ పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు జోగి సుబ్బారావు, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్ బసవ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి, కిడ్నాప్..
యువకుడికి రిమాండ్

గుడ్లవల్లేరు, ఆగస్టు 7: ప్రేమ పేరుతో మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(15)కు పరిచయమై, ఆమెపై లైంగిక దాడికి పాల్పడి, తర్వాత కిడ్నాప్ చేసి, 8 రోజుల తరువాత బాలికను గ్రామంలో వదిలేసి పరారైన యువకుడిని గుడ్లవల్లేరు పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి అతనికి 15 రోజులు రిమాండ్ విధించారు. గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను రావులపాలెం మండలానికి చెందిన పల్లెవెల రామకృష్ణ(21) తన స్నేహితుడైన శేరిదగ్గుమిల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ద్వారా బాలికకు ఫోన్‌లో పరిచయమయ్యాడు. పలుమార్లు బాలికకు ఫోన్ చేసి మాట్లాడుతూ ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. గుడ్లవల్లేరు వచ్చి ఆమెపై లైంగిక దాడి చేశాడు. జూలై 29వ తేదీన తన స్నేహితుడైన దగ్గుమిల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బాలికను బైక్‌పై ఎక్కించుకుని గుడ్లవల్లేరు రైల్వేస్టేషన్ రోడ్డులో రామకృష్ణకు అప్పగించాడు. రామకృష్ణ ఆ బాలికను ఆటోలో గుడివాడకు, అక్కడి నుంచి బస్సులో విజయవాడకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడి నుంచి తెలిసిన వారి ద్వారా కర్ణాటకకు తీసుకెళ్లాడు. తల్లిదండ్రులపై బెంగతో బాలిక తనను తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లాలని రామకృష్ణను కోరగా అతను ఆగస్టు ఐదో తేదీన గుడ్లవల్లేరులో వదిలేసి పరారయ్యాడు. తల్లిదండ్రులు అప్పటికే గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. వారు పోలీసుల వద్దకు వచ్చి జరిగిన ఉదంతాన్ని చెప్పారు. రామకృష్ణను గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ అరెస్టు చేయించి, కోర్టులో హాజరుపరిచారు. శేరిదగ్గుమిల్లికి చెందిన వ్యక్తికోసం వెతుకుతున్నామని ఎస్సై తెలిపారు.



చల్లపల్లిలో ఎల్ఐసీ అసోసియేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్

ఎల్ఐసీ మచిలీపట్నం డివిజన్‌కు దేశంలోనే అగ్రస్థానం

చల్లపల్లి, ఆగస్టు 7: దేశంలోని 113 ఎల్ఐసీ డివిజన్లలో మచిలీపట్నం డివిజన్ అగ్రస్థానంలో ఉందని ఎల్ఐసీ మచిలీపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ సుధాకర్‌బాబు తెలిపారు. చల్లపల్లి పోలీస్ స్టేషన్ బజారులో నూతనంగా ప్రారంభించిన ఎల్ఐసీ అసోసియేట్(లికా) కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎల్ఐసీ అవనిగడ్డ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్, ఏబీఎం రామయ్య, ఎస్‌జీఏ బాషా పాల్గొన్నారు.

మండల పరిషత్
ఏవోగా శిరీషకుమారి

పెడన రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి(ఏవో)గా జి.శిరీషకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పమిడిముక్కలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఆమె పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆమెను ఎండీవో వి.రెడ్డయ్య, ఈవోఆర్డీ జయరామ, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి కార్యాలయ సిబ్బంది అభినందించారు. నందిగం గ్రామానికి రత్నాకరరావు, పుల్లపాడుకు శివనాగేశ్వరరావు, కమలాపురానికి మీరా, చేవేంద్రకు పర్వతుల్లా కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారు.

పులిగడ్డ పంచాయతీ
కార్యదర్శిగా బి.అనిత

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 7: పులిగడ్డ పంచాయతీ కార్యదర్శిగా బి.అనిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆమె పదోన్నతిపై వచ్చారు. సచివాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు అఖిల పక్ష సమావేశం

అవనిగడ్డ, ఆగస్టు 7: నియోజకవర్గ అభివృద్ధిపై, సమస్యలపై చర్చించేందుకు గురువారం ఉదయం 10 గంటలకు గాంధీక్షేత్రంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

భారీ వర్షం

బందరులో నీట మునిగిన రోడ్లు





పులిగడ్డ మహాలక్ష్మి ఆలయంలోకి చేరిన నీరు, బందరులో నీళ్లలో కొట్టుకుపోతున్న వృద్ధుడిని రక్షించిన మాదివాడ రాము, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి శ్రీరాం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7: మచిలీపట్నంలో బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని ప్రధాన రహదారులు నీట మునిగాయి. బస్టాండ్ సెంటర్, రేవతీ సెంటర్, కోనేరుసెంటర్లు జలమయమయ్యాయి. మునిసిపల్ అధికారులు మోటార్ల ద్వారా లోతట్టు ప్రాంతాల్లో నీళ్లను తోడించారు. కమిషనర్ బాపిరాజు మునిగిన ప్రాంతాలను సందర్శించారు.



బందరు బస్టాండ్ నుంచి కోనేరుసెంటర్‌కు వెళ్లే రోడ్డులో భారీగా చేరిన నీరు

మండలంలో 59.2 మిల్లీమీటర్లు

నాగాయలంక: మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. 59.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. అంతర్గత రహదారుల్లో నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు అసౌకర్యం కలిగింది.

అవనిగడ్డ రూరల్: పులిగడ్డలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోకి భారీ వర్షం కారణంగా నీరు చొచ్చుకొచ్చింది.

మానవత్వం పరిమళించే..

మచిలీపట్నం టౌన్: భారీ వర్షం కారణంగా డ్రెయిన్లు పొంగి, ఆ ప్రవాహవేగానికి ఒక వృద్ధ యాచకుడు నీటిలో కొట్టుకుపోతుంటే అటుగా వెళ్తున్న మచిలీపట్నం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శ్రీరాం, స్వామి అతడిని గట్టుకు చేర్చారు. ఫైర్ ఆఫీసరుకు ఫోన్‌చేశారు. జనసేన నాయకుడు మాదివాడ రాము, రజక సంఘ నాయకుడు ఊకంటి రాంబాబు సాయం అందించారు. 108 వాహనంపై జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స చేయించాక బంధువులు వృద్ధుడిని తీసుకెళ్లారు.

చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

● నిర్వాహకులు, కార్మికులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ

గుడివాడ: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చిన్న తరహా పరిశ్రమలు భారీగా నష్టపోయాయని, టీడీపీ కూటమి ప్రభుత్వంలో చిన్న తరహా పరిశ్రమలను పోత్సహిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. బుధవారం ప్రజావేదికలో ఎమ్మెల్యేను చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులు కలిశారు. కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆటోనగర్ అభివృద్ధి, పరిశ్రమలను ప్రోత్సహించడంలో గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎమ్మెల్యే అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మిక రంగ అభివృద్ధిలో భాగంగా రాయితీలను తిరిగి అమలు చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు టి.లక్ష్మణరావు, హమీద్, నాగరాజు, బాషా, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులు

ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

● ఏలూరు రోడ్డులో ఓ రెస్టారెంట్ సీజ్

గుడివాడ: గుడివాడలోని పలు రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహినుద్దీన్ తన బృందంతో కలిసి తనిఖీలో పాల్గొన్నారు. హోటళ్లలో కాలపరిమితి దాటిన ముడి పదార్థాలను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఫంగస్ పట్టిన బ్రెడ్లు, హానికారక రంగులను వినియోగిస్తున్నారని, ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని ఆయన తెలిపారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని, నిబంధనలు పాటించని పలు హోటళ్లపై సెక్షన్ 61 ప్రకారం జరిమానాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏలూరురోడ్డులోని ఒక రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.



రెస్టారెంట్‌లో బిర్యానీని పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

నాయీ బ్రాహ్మణులకు మేలు చేస్తాం

● ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ హామీ

అవనిగడ్డ, ఆగస్టు 7: ఆలయాల్లోని కేశఖండనశాలల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు మేలు చేసేలా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కేశఖండనశాలలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు ఆయనను బుధ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, నాయీ బ్రాహ్మణులకు మేలు చేకూర్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండలి వెంకట్రామ్, రావి రత్నగిరి, రిమ్మనపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎం.బాలభాస్కరరావు పాల్గొన్నారు.



బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు

ఈ-పంట నమోదు తప్పనిసరి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7: తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లాలోని రైతులకు జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి ఎన్.పద్మావతి సూచించారు. బుధవారం గూడూరు మండలంలోని పంట పొలాలను మండల ఏవో శివప్రసాద్‌తో కలిసి ఆమె సందర్శించారు. రైతు చలువాది సాంబశివరావుతో మాట్లాడారు. పంట పొలాల్లో బీపీటీ-5204 నాటినట్లు రైతులు తెలిపారు. రైతులకు సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాఖాధికారులు సూచనలు ఇచ్చారు. ఈ-క్రాప్ చేయించుకోవడం వల్ల ధాన్యం సేకరణ, అకాల వర్షాలు, తుపాన్లకు పంట నష్టపోయినపుడు ఇన్సూరెన్స్ పొందే అవకాశం ఉందని పద్మావతి తెలిపారు.



వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి

ప్రతీ ఒక్కరూ మొక్క నాటండి

మోపిదేవి, ఆగస్టు 7: ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకనుగుణంగా అమ్మ పేరుతో ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చిరువోలు బుచ్చిరాజు పిలుపునిచ్చారు. బుధవారం మోపిదేవి, చిరువోలు, మెరకనపల్లి గ్రామాల్లో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో బీజేపీ అవనిగడ్డ నియోజకవర్గ ఇంచార్జ్ తుంగల మురళీ మొక్కలను నాటారు. సనకా ప్రశాంత్, కోసూరు వేణుగోపాలరావు పాల్గొన్నారు.



ఆవిరిపూడి-కాజ రోడ్డుపై గుంతల్లో నాట్లేస్తున్న ఆవిరిపూడి గ్రామస్థులు

రోడ్డు బాగుచేయలేదని నాట్లేసి నిరసన

కూచిపూడి, ఆగస్టు 7: మొవ్వ మండలంలో ఆవిరిపూడి-కాజ రోడ్డుపై ఆవిరిపూడి, పాలంకిపాడు మధ్య గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉందని, పదేళ్ల నుంచి రోడ్డును అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవిరిపూడి గ్రామస్థులు గుంతల్లో నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ రహదారి ధ్వంసమవడంతో విద్యార్థులు, ప్రయాణికులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసీ బస్సులు, పాలవాహనాలు వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా ఉందని వారు తెలిపారు. రహదారిని వెంటనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, గ్రామస్థులు కుంభా వెంకటేశ్వరరావు, మేడిశెట్టి శ్రీనివాసరావు, చలమలశెట్టి రామస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

ఘంటసాల, ఆగస్టు 7: జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య విగ్రహానికి ఎంపీడీవో మారుతి శేషమాంబ, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఈవో జయలక్ష్మి, కోస్తాంధ్ర పద్మశాలీ సంఘ అధ్యక్షుడు జి.వి.నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ ఆధ్వర్యంలో ఇద్దరు చేనేత కార్మికులను సత్కరించారు. ఉడతా చిత్తరంజన్ సాయి, గుత్తికొండ సత్యనారాయణ, కొడాలి శ్రీకాంత్, జంజనం రామ్మోహనరావు, జంజనం శివరామకృష్ణ, అక్కల లీలా ప్రసాద్, మురుగుడు నాంచారయ్య, విట్టంశెట్టి సుధాకర్, కోదాటి నాగయ్య, జంజనం కనకదుర్గ పాల్గొన్నారు.



ఘంటసాలలో ప్రగడ కోటయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, నేతలు

చేనేత కార్మికుల స్థితిగతులపై అధ్యయనం

పెడన: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నాయకులు బుధవారం పట్టణంలో పర్యటించి చేనేత కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేశారు. చేనేత మగ్గాలపై వస్త్రాలు తయారవుతున్న విధానాన్ని పరిశీలించి చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. చేనేత కార్మికులను చేనేత వస్త్రాలతో సత్కరించారు. శలంకాయల లీలాకుమారి, దానోహం సత్యవతి, కోలాటం పద్మావతి, మట్టా రూన్సీ, గురువర్తి మంజూష పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

పెడన రూరల్: చేనేత సమస్యల పరిష్కారం కోసం ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నిరంతరం పనిచేస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ తెలిపారు. చేనేత దినోత్సవం సందర్భంగా పడమట వీధిలోని విఘ్నేశ్వర ప్రార్థనా మందిరంలో యునెస్కో, ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కళాకారులను సమావేశంలో సన్మానించారు. మహిళలకు చేనేత చీరలు పంచారు. దూరదర్శన్ వార్తా విభాగాధిపతి గుత్తికొండ కొండలరావు చేనేత నాయకులు సమతం రమణ మహేష్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, కౌతరపు రాజేశ్వరి, కట్టా హేమసుందరరావు పాల్గొన్నారు.



మంటాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

కన్నులపండువగా కలశాభిషేకం

పమిడిముక్కల, ఆగస్టు 7: మంటాడలోని అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక ఆగమన మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల్లో మొదటి రోజున అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూలవరులకు అష్టోత్తర 108 శత కలశాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు.

గోదాదేవి తిరునక్షత్ర పర్వదిన వేడుకలు

గుడివాడ: పాటిమీద భూనీల సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీఆండాళ్(గోదాదేవి) అమ్మవారి తిరునక్షత్ర పర్వదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, విశేషపూజలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణరావు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈవో నటరాజన్ షణ్ముగం వేదపండితుడు వేదాంతం అప్పలాచారి, భక్తులు పాల్గొన్నారు.

11న పద్మశాలీయుల రాష్ట్ర సమావేశం

ఘంటసాల, ఆగస్టు 7: రాష్ట్రంలోని పద్మశాలీయులీలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఐక్యంగా ఉంచేందుకు, చేనేతల సమస్యలపై పోరాడేందుకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 11వ తేదీన కోస్తాంధ్ర, రాయలసీమ పద్మశాలీ సంఘాల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, పద్మశాలీయులు తరలిరావాలని కోసాంధ్ర పద్మశాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం ఘంటసాలలో వారు మాట్లాడారు.

నేటి నుంచి ఎంపీటీసీలు,
సర్పంచ్‌లకు శిక్షణ

కూచిపూడి, ఆగస్టు 7: మొవ్వ మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌లకు గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎండీవో చంద్రశేఖర్‌రావు తెలిపారు. పరిపాలన, అభివృద్ధి సంబంధిత అంశాలపై వీరికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

● **పెదపారుపూడి:** మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు.



లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న మండలి వెంకటేశ్వరరావు

మర్యాదపూర్వకంగా..

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 7: మంత్రి నారా లోకేశ్‌ను పులిగడ్డ పంచాయతీ ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. లోకేశ్‌కు కప్పబోయిన శాలువాను వెంకటేశ్వరరావుకే మంత్రి కప్పి సత్కరించారు. లోకేశ్ విద్యాశాఖను మరింత బలోపేతం చేస్తారని అన్నారు.

జక్కా గోవర్ధనరావు
కన్నుమూత



పమిడిముక్కల, ఆగస్టు 7: ఉయ్యూరు ఏజీఅండ్‌ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు, శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ తాడంకి గ్రామానికి చెందిన జక్కా గోవర్ధనరావు (72) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల ఆయన గుండెపోటుతో విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరగా చికిత్స పొందుతూ మృతి చెందారు. గోవర్ధనరావు భౌతికకాయానికి తాడంకిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, శ్రీశ్రీనివాస విద్యా సంస్థల అధినేత పరుచూరి శ్రీనివాసరావు నివాళులర్పించారు.

ముగిసిన తల్లిపాల
వారోత్సవాలు

పామర్రు, ఆగస్టు 7: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ముగిశాయి. అరండల్‌పేట అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ముగింపు కార్యక్రమానికి సీడీపీవో భానుశ్రీ విచ్చేశారు. బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ ఉమ్మడి అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులు పద్మజ, శ్రీపతిప్రేమకిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫేక్ డ్వాక్రా సంఘాలపై
చర్యలు తీసుకోండి

● జనసేన మండల అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర

గుడివాడ రూరల్, ఆగస్టు 7: వైసీపీ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు గుడివాడ మునిసిపాలిటీలో ఫేక్ డ్వాక్రా సంఘాలు ఏర్పాటుచేసి, కొందరు డ్వాక్రా ఆర్పీలు, బుక్ కీపర్లు స్థానిక వైసీపీ నాయకులతో కలిసి పేదల సొమ్మును దోచుకు తిన్నారని జనసేన పార్టీ గుడివాడ మండల అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర ఆరోపించారు. కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్నారు. దీనిపై ఎమ్మెల్యేకు ఆధారాలతో అందజేస్తామని ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే దీనిపై విచారణ చేసి దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధి శిక్షణ కేంద్రం ప్రారంభం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7: బందరు మండలం పోతేపల్లి ఆటోనగర్‌లో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఉపాధి శిక్ష కేంద్రాన్ని బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ ప్రారంభించారు. వృత్తి విద్యా శిక్షణ తరగతులు, జూట్ బ్యాగ్, స్ర్కీన్ ప్రింటింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 30 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర కో ఆర్డినేటర్ కొమరగిరి శ్యామ్‌ప్రసాద్, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ ఆర్.వి.శ్రీకాంత్, స్టేట్ బ్యాంకు మేనేజర్ ఎ.అశోక్ కుమార్, వైద్య విభాగ సమన్వయకర్త డాక్టర్ సాయిప్రసాద్, ఎస్.నాగమణి, పోతుకూచి అంజనేయకుమార్, వై.సాయిబాబు, వరప్రసాద్, కోమలాదేవి, కొట్టి నాగమణి పాల్గొన్నారు.

200 లీటర్ల నాటుసారా స్వాధీనం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7: బందరు మండలం పోలాటితిప్పలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు చేశారు. 200 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కొక్కిలిగడ్డ బసవయ్య, మోకా వెంకటేశ్వరమ్మ, సున్నపూడి భారతి, వెంకటేశ్వరమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గ్రామాన్ని నాటుసారారహితంగా తీర్చిదిద్దాలని గ్రామసభలో సర్పంచ్ మోకా రాజును పోలీసులు కోరారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తోట్లవల్లూరు, ఆగస్టు 7: పెనమకూరు ఉత్తర, దక్షిణ దళితవాడల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం భారత యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్స్, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మణస్వామి జయంతి

అవనిగడ్డ, ఆగస్టు 7: అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి వేడుకలు అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ సభ్యులు అవనిగడ్డ 4వ వార్డులోని అగ్నికుల క్షత్రియ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు. నేతలు లక్ష్మణస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. ఒడుగు నాగార్జున, లంకే యుగంధర్, కోలా బాలాజీ, టి.నాగాంజనేయులు, కోలా వెంకటేశ్వరరావు, నాంచారయ్య పాల్గొన్నారు.